# రంగుల దేరా

“జూ”లో కటకటాల వెమక జంతువుల్ని చూస్తూంటే కట కటా ఇష్టంలేకుండా కాపరాల కెళ్ళిన అమ్మాయిలు గుర్తుకొస్తారు నాకు.

అహా; సర్కస్‌లో అలాకాదు.

బ్యాండు వాయిస్తోంటే. టికెట్టు కొన్న అన్ని వేల జతల కళ్ళ ముందు అర్ధగ్నంగా తొడలాగులు, బాడీలు వేసుకుని రబ్బరు బంతుల్లా ఎగురు కుంటూ గంతులు వేసే ఆడపిల్లలు.

ఒంటి చక్రంసైకిలు తొక్కుతూంటే.

తీగమీద నడిస్తే:

ఉయ్యాల ఫీట్లు చేస్తోంటే.

ఆ రంగు రంగుల లైట్లకాంతిలో జిగేల్. జిగేల్‌మని మెరిసి పోతూ దిగివచ్చిన దేవ కన్యల్లా చూడ్డానికి ఎంతో బావుంటారు వాళ్ళు:

ఆకారణంగా రోజూ ఆ తీగమీద మగవాడు ఆ అర్ధనగ్న సుంద రిమీద ఎన్నో కత్తులు విసురుతాడు

కొందరు మగవాళ్ళు ఆడవాళ్ళకేసి అలానే కత్తులు విసురు తున్నట్లు చూస్తారు..

ఎవరికీ కత్తులు గుచ్చుకోకూడదు

గుచ్చుకోవాలని ఏ పాపాత్ముడూ కోరడు.

ఆ తీగమీద నడిచే అందాల బాల పడిపోకూడదు

పడిపోకూడదు.

రక్షించు దేవుడా; రక్షించు.

అంత అందమైన అమ్మాయి కాలు జారిపడి నెత్తుటి మడుగులో పొర్లాడ్డం నేన్చూడలేను. చూడలేను.

అందుకని ఏ అమ్మాయి కాల్జారకూడదు

ఎవరి పీకా తెగిపోకూడదు. ఏ సంసారం చల్లారకూడదు

తండ్రీ అందరూ చల్లగా వుండాలి:

బాబూ అందరూ బాగుండాలి:

నాయనా అంతా కుశలమే కదా:

లోకం పులి నోట్లో తల దూర్చిన మగాడు తలను పైకి తీసుకో గలడో లేడో....

అసలు కలండనెడువాడు కలడో లేడో....మన జీవితాలను బోనులో పెట్టి వీలయినపుడల్లా ఆడించే ఆ రింగ్ మేస్టరు కలడో లేడో?

అన్నీ సందేహాలే। అన్నీ ఆశ్చర్యార్థకాలే।

ఆఫీసులో పనులై పోయాక విలన్ చేత। చావుదెబ్బలు తిన్న హీరోలా ఇంటి కొచ్చే మొగాళ్ళ జీవితం పులి నోట్లోంచి తలకాయ బయటికి తీస్తారా అనిపిస్తోంది.

ఎప్పుడో కటిక్కున కొరికేస్తుంది పులి

ఎప్పుడో దబిక్కున జారి పడుతుంది తీగ మీంచి పిల్ల.

ఎప్పుడో విసిరిన కత్తి ఎక్కడో గుచ్చు కొంటుంది అందంగా నిలబడ్డ అర్థ నగ్న సుందరికి

ఎప్పుడో సింహాలు. పెద్ద పులులు తిరగ బడి కటకటాల్ని దూకి. కటకటా ఆడియన్స్ లోకి వచ్చి మనం మనం ఒకటే అని కలిసి పోతాయి.

చివరి నిముషా విలన్ చేతిలో చావుదెబ్బలు తిన్నా చిట్ట చివరకు హీరోయే నెగ్గుతాడు.

కాని. ఎప్పుడో విలన్ చేతిలో హీరోయే చస్తాడు

నూరు సినిమాల్లో యాక్టు చేసిన వాడైనా ఒక్క సినిమాలో దెబ్బ తింటాడు.

పది మందిని నవ్వించిన హాస్యనటుడు లేదా సర్కస్ లోదబూన్ - ముల్లు గుచ్చుకుంటే ఏడుస్తాడు.

పులి నోట్లో తలకాయ దూర్చిన ఆసామీ పెళ్ళాం కేసి చూడానికి భయ పడతాడు.

గజీతగాడికి అల్లుడ్ని చూస్తే భయం!

సర్కస్‌లో మన కళ్ళముందు అర నగ్నంగా తిరిగిన అమ్మాయిల్ని దేరాల్లో వాళ్ళంతా బట్ట కప్పుకుని చీరల్లో వుండటం చూసి ఆశ్చర్యపోయాను.

అప్పుడు వాళ్లు చాలా దీనంగా రాక్షసుల చేతుల్లో ఓడిపోయిన దేవతల్లా మంచి రోజుల కోసం ఎదురు చూస్తున్న మానవులవలె అగపడ్డారు.

ఎందుకో సర్కస్ కంపెనీ వాళ్ళంటే నాకు చాలా ఇష్టం!

సర్కస్ కంపెనీ వాళ్ళు వచ్చి వూళ్ళో కాళీ జాగాలో దేరాలు వేసుకోగానే మా పిల్లల మనసుల్లో రంగు రంగుల దేరాలు ఎవరో వేసినట్లుండేవి.

కన్నెపిల్ల మనసులో పెళ్ళయాక జీవితమంటే ఎన్నెన్ని రంగుల దేరాలు వెలుస్తాయో?

ఆ దేరాలో తన చేత సర్కస్ ప్లే చేయించే పురుషుడు ఆ రింగ్ మేస్టరు ఎలాటి వాడొస్తాడో ..

ఆ రంగుల దేరా వర్షంలో తడిసిపోయి గాలికెగిరిపోతుందో. వెన్నెలలో కరిగి కరిగి కన్నులలో వెలిగి వెలిగి ...చీకట్లో రంగురంగుల దీపాల కాంతిలో జీవితాన్ని జగజ్జేగీయమానం చేస్తుందో ఎవరికి తెలుసు? ఎవరు చెప్పగలరు?

ఒంటినిండా పుల్ వాయిల్ చీరకట్టుకుని సూటేసుకున్న మొగుడి

పక్కని కూర్చుని సర్కస్ చూసే జెంటిల్మానుగారి భార్యకు ఒక చెంపను సౌందర్యం ఒలకపోస్తూ పేరొక చెంపను సాహసంవిరజిమ్మే తీగమీద సైకిలుతొక్కే అర్ధనగ్న సుందరిని చూస్తే ఏమనిపిస్తుందో.

ఎవరికి తెలుసు? వాళ్ళు మండుతుందో ఏమో....

నా మటుకు నాకు-కింగ్‌జార్జి ఫిఫ్త్ కంటె. లెక్కల మాస్టారికంటె. ఎలిజబెత్ రాణికంటె. మంత్రసాని మరదలు కంటె. అశోకుని కంటె. అప్పారావు బస్సు డ్రయివరుకంటె జవహర్లాల్ నెహ్రూకంటె. ఆఖరికి మావూరి హెడ్‌కానిస్టేబులు వెంకటస్వామికంటె కూడా సర్కస్‌లో రింగ్‌మాస్టరంటేనే పెద్దగౌరవం!

కాని డేరాలు ఎత్తేసుకుని ఆ లైట్లన్నీ పీకేసుకుని ఏనుగుల్ని. లొట్టిపిట్టల్ని కుక్కల్ని. గుర్రాల్ని తీసుకుని వాళ్ళు వూరు వదలివెళ్ళిపోతూంటే - మాచెడ్డ దిగులుగా వుండేది.

అంతమందీ సుందరీమణులు అందరు యువకులు. అన్ని జంతువులూ. మృగాలూ మనకోసం వచ్చి మనల్ని ఆనందపరచి సెలవంటూ వెళ్ళి పోయాక ఆ కాళీజాగాకేసి చూస్తే భయంకరంగా ఎంతో బాధగా కూడా వుంటుంది.

రంగుల డేరా ఎత్తేశాక ఆ కాళీ మైదానాన్ని చూడటమంటే సముద్రం ఎండిపోయాక దిగంతాల వరకూ వ్యాపించే అఖండమైన ఆ ఇసుక పర్రను చూస్తే ఎటువంటి భీతి కలుగుతుందో అటువంటి భావం మనసులో మెదులుతుంది.

గారడీవాడు తమాషాలుచేసి వెళ్ళిపోతూంటే. అప్పుడే అయిపోయిందా అనిపించేస్తుంది.

సర్కస్‌డేరాలు ఎత్తేశాక ఆ మైదానం పెళ్ళి పందిళ్లు తీశాక వెలవెలబోతున్న పెళ్ళయిన ఇల్లులా వెలితిగా వుంటుంది.

కొన్నాళ్ళయాక ఆ వెలితికి అలవాటు పడి పోతారు. అప్పుడు కన్నెపిల్లమనసులో రంగులు డేరా వెలిసినట్లు ఆ సంగతి మనసుని హత్తుకుని పోయి మళ్లీ సర్కస్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తే రాగానే సంబరపడి పోతాము

హరికథలకి. పాట కచేరీలకి వెళ్ళే వాళ్ళ కంటె సర్కస్‌కి వెళ్ళే వాళ్ళంటేనే నాకు ఎక్కువ ఇష్టం.

అబ్బ! రంగులడేరాని నా జన్మలో మర్చిపోలేను.

ఏమండోయ్ శ్రీవారూ ఒక చిన్నమాట!

మన సంసారం ఒక చిన్న రంగుల డేరా అయితే అందులో రింగ్ మేస్టరు మీరు. కత్తులు నా మీద విసురుతారు.

మన పిల్లలు జంతువులు. మన పాలవాడు. పని మనిషి కోతులు. చింపాంజీనూ. మన ఇంటి వాళ్ళు ఏనుగులు. మీ ఆఫీసువాళ్ళు పెద్ద పులులూ. సింహాలూనూ. మా చెల్లెళ్ళు సర్కస్ కన్యలైతే మీ తమ్ముళ్ళు బఫూనులు.

"అయితే హిపో పొటోమస్ ఎవరూ —"

అమ్మబాబోయ్ చంపేస్తారు నేను చెప్పను గాక చెప్పను!